# కందిలి

www.kandilinews.com

న్యూస్.. దారిచూపే దీప శిఖ

గురువారం | 30.04.2026 సంపుటి: 01 | సంచిక: 262 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800




మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి

- గతేడాది జూన్ 30న సిగాచీలో ఘోర ప్రమాదం
- పరిశ్రమలో పనిచేస్తున్న 54 మంది దుర్మరణం
- ఇప్పటికీ నరకయాతన అనుభవిస్తున్న క్షతగాత్రులు
- పరిహారం కోసం బాధిత కుటుంబాలు పోరాటం చేయాల్సిన దయనీయ స్థితి
- పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం సుస్పష్టంగా తేలినా కఠిన చర్యలు కరవు
- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారమిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ నెరవేరని తీరు
- ఒక్కో బాధిత కుటుంబానిది ఒక్కో మానవీయ గాథ
- పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికుల ఇళ్లలో అంతులేని శోకం
- ప్రమాదం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న పరిస్థితిని అందరికి తెలియజేసేలా 'కందిలి' ప్రయత్నం
- మానవీయ కథనాలు, పరిశ్రమ, ప్రభుత్వ వైఫల్యాలు వెలుగులోకి తెచ్చేలా పుస్తకావిష్కరణకు ప్రయత్నం
- **భిన్న కథనాలు 'కందిలి' వేదికగా రేపటి నుంచి ప్రచురణ**



# మానిపోని గాయాలకు... అక్షర రూపం!

**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమలో గతేడాది జూన్ 30న ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. దేశంలోనే అతి పెద్ద దుర్ఘటనగా నిపుణులు, అధికారులు చెప్పుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఏకంగా 54 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో 8 మంది అవశేషాలు కూడా లభించలేదు. 29 మంది క్షతగాత్రులయ్యారు. 11 మందికి తీవ్ర, 17 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన మరుసటి రోజే సీఎం రేవంత్ రెడ్డి సిగాచీ వద్దకు వచ్చారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి ఎక్స్ గ్రేషియా ఇస్తామని ప్రకటించారు. ఆహామీ నేటికీ పూర్తిగా నెరవేరలేదు.

## వలస జీవుల ఇళ్లు... శోక సంద్రాలు!

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో అత్యధికులు వలస కార్మికులే. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం వచ్చిన వారే. ఒక ఇంట్లో ఇద్దరు కుమారులు మృతి చెందారు. ఒక కన్నతండ్రికి కనీసం తన కొడుకు అస్తికలు కూడా లభించలేదు. కోటి ఆశలతో పెళ్లి చేసుకున్న నవదంపతులు దుర్మరణం పాలయ్యారు. ఇలా చెబుతూ ఉంటే, ఒక్కొక్కరిది ఒక్కో దయనీయ కథ. ముక్కు పచ్చలారని చిన్నారులు నాన్నా అని పిలిచే అదృష్టానికి దూరమయ్యారు. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చిన నివేదికలతో పాటు వార్తాకథనాలు కూడా పరిశ్రమ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేశాయి. అయినా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చర్యలు లేవు.

## ఏడాది కావొస్తున్న తరుణంలో!

ప్రమాదం జరిగి ఈ ఏడాది జూన్ 30తో ఏడాది పూర్తికానుంది. ఈ క్రమంలో ప్రమాదం జరిగిన నాటి నుంచి నేటి వరకు చోటు చేసుకున్న కీలక పరిణామాలు, ప్రభుత్వ, అధికార యంత్రాంగం వైఫల్యాలు, బాధిత కుటుంబాల దయనీయ గాథలకు అక్షర రూపం ఇవ్వాలని 'కందిలి' సంకల్పించింది. రేపటి నుంచి ఒక్కో కథనాన్ని అందించాలని నిర్ణయించింది. జూన్ 30న వీటన్నింటినీ కలిపి పుస్తక రూపంలో అందరికీ ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

## పౌర సమాజం.. కీలక పాత్ర!

సిగాచీ బాధితుల గొంతు ఇప్పటికీ వినబడుతుందంటే అందుకు ప్రధాన కారణం పౌర సమాజం. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కలపాల బాబూరావు, హైకోర్టు న్యాయవాది వసుధ, కన్నెగంటి రవి, వై. అశోక్ కుమార్... ఇలా ఎంతోమంది వారికి మద్దతుగా నిలిచారు. పిల్ వేయడం మొదలు బాధితుల పక్షాన నిలిచి నేటికీ పోరాడుతున్నారు. 'కందిలి' తొలి నుంచి బాధితుల పక్షమై నిలిచింది. ఈ క్రమంలో సమగ్ర సమాచారం, కన్నీళ్లు పెట్టించే కథనాలు, ప్రభుత్వ వైఫల్యాలు, పౌర సమాజం స్పందించిన తీరు.. ఇలా అన్ని అంశాలు పుస్తక రూపంలో నిక్షిప్తం చేయాలనేది మా ప్రయత్నం. మీ ఆలోచనలు, సూచనలు ఆహ్వానిస్తున్నాం.



# సంగారెడ్డి నియోజకవర్గంలో... కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుల పేర్ల ప్రతిపాదనలు!

- **సంగారెడ్డి, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సహా టౌన్, మండలాల అధ్యక్షుల పేర్లను ప్రతిపాదించిన జగ్గారెడ్డి**
- **ఏఐసీసీ సూచనల మేరకు కసరత్తు చేసిన తుది జాబితా**
- **ఈ పేర్లను జిల్లా అధ్యక్షురాలు నిర్మలకు అందజేత**
- **పార్టీ కోసం కొన్నేళ్లుగా పనిచేస్తున్నవారికే ప్రాధాన్యం**

కందిలి, సంగారెడ్డి: ఏఐసీసీ సూచనల మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న బ్లాక్ ప్రెసిడెంట్, టౌన్ ప్రెసిడెంట్, మండల ప్రెసిడెంట్లను మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలో కొత్తవారిని నియమించేందుకు వీలుగా ఆయన పేర్లను ప్రతిపాదించారు. ఈ జాబితాను కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డికి అందించారు.

## నూతన అధ్యక్షులుగా ప్రతిపాదిత పేర్లు ఇలా...



**1) సంగారెడ్డి బ్లాక్ ప్రెసిడెంట్**
జార్జ్ మాథ్యూస్ ( క్రిస్టియన్- BC(C)
Mobile no: 9949999494
( సంగారెడ్డి టౌన్, కంది మండలం, సంగారెడ్డి మండలం కలిపి సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పరిధిలోకి వస్తాయి)




**2) సదాశివపేట బ్లాక్ ప్రెసిడెంట్**
చాట్ల సిద్దన్న( BC- లింగాయాత్)
Mobile no: 9949962167
( కొండాపూర్ మండలం, సదాశివపేట టౌన్, సదాశివపేట మండలం సదాశివపేట బ్లాక్ పరిధిలోకి వస్తాయి)



**3) సంగారెడ్డి టౌన్ ప్రెసిడెంట్**
ఆర్. కిరణ్ గౌడ్ (BC-–B గౌడ్)
Mobile no: 9866703666



**4) సంగారెడ్డి మండల ప్రెసిడెంట్**
ఎం.డి ఖలీల్ ( ముస్లిం మైనార్టీ)
Mobile no: 9247356548



**5) కంది మండల ప్రెసిడెంట్**
బి. మొగులయ్య ( SC - మాదిగ)
Mobile no: 9951676597



**6) కొండాపూర్ మండల ప్రెసిడెంట్**
పి. మల్లా రెడ్డి ( OC- రెడ్డి)
Mobile no: 9885483895



**7) సదాశివపేట టౌన్ ప్రెసిడెంట్**
పి. నాగరాజు గౌడ్ ( BC–-B- గౌడ్)
Mobile no: 9542425551



**8) సదాశివపేట మండల ప్రెసిడెంట్**
ఒగ్గు శ్రీనివాస్ ( BC -B- యాదవ్)
Mobile no: 9652915343





# సీఎం రేవంత్ రెడ్డి రైతు ద్రోహి!

- **వడ్లు కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతల ఇబ్బందులు**
- **క్వింటాలుకు అయిదు కిలోల దాకా తరుగు తీస్తూ గోస పెడుతున్నరు**
- **మొక్కజొన్న, సన్ ఫ్లవర్ పండించిన రైతులదీ ఇదే దయనీయ స్థితి**
- **రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై హరీశ్ రావు మండిపాటు**
- **సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రం సందర్శన**

**కందిలి, సిద్దిపేట**

"సీఎం రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కాదు... ఆయన రైతు ద్రోహి. ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన అన్నదాతలను అరిగోస పెడుతున్నారు. ధాన్యం కుప్పల వద్ద రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినా ఈ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లయినా లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను గాలికి వదిలేశార"ని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

**హరీశ్ రావు కామెంట్స్ ఇలా!**

- సీఎం రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కాదు.. ఆయన రైతు ద్రోహి. ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు చాలా గోస పడుతున్నారు.
- ఆన్ లైన్ పేరు మీద రైతులను ఇబ్బంది కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. తెలంగాణలోని కొన్ని జిల్లాలలో క్వింటాలుకు అయిదు కిలోల వరకు తరుగు తీస్తున్నారు.
- సీఎం రేవంత్ రెడ్డి.. మీరు రైతు బిడ్డ కాదు. ఒకవేళ రైతు బిడ్డవు అయుంటే వడ్ల కొనుగోలు కేంద్రానికి వచ్చేవారు మీరు. రైతుల వద్దకు మీరు రారు. మీ మంత్రులు రావడం లేదు.
- ఏసీ గదిలో కూర్చుని మాట్లాడడం కాదు రేవంత్ రెడ్డి. మీకు దమ్ముంటే రైతుల దగ్గరికి వచ్చి మాట్లాడండి.
- మొక్కజొన్నలు, సన్ ఫ్లవర్ కొనక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కుప్పల దగ్గర పది రోజులుగా నిద్ర చేస్తున్నారు. అయినా ప్రభుత్వం ఏమాత్రం రైతులను పట్టించుకోవడం లేదు.
- మా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు, మేము వడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళ్లేవాళ్లం. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే వాళ్లం.
- కొనుగోలు కేంద్రాల ద్వారా తక్షణమే ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేయాలి. రైతుల తిప్పలు తీర్చాలి. లేదంటే తీవ్ర పరిణామాలుంటాయి. తిట్ల పురాణం తప్ప రేవంత్ రెడ్డికి ఏమీ తెలియదు. వడ్లు కొనుగోలు చేయకపోతే రహదారులు దిగ్బంధం చేసి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తాం.







## మాలధారులతో కలిసి భిక్ష... రూ.లక్ష విరాళం అందజేత!

సిద్దిపేట పట్టణం గణేష్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ స్వాములతో కలసి భిక్ష కార్యక్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. హనుమాన్ మాలధారణ స్వాముల సిద్ది సంకల్పం సఫలం కావాలని ప్రార్థించారు. దేవాలయంలో స్వాములకు 21 రోజుల పాటు భిక్షకు శాశ్వత విరాళంగా ఏటా ఆయన రూ.లక్ష అందిస్తుంటారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా హరీశ్ రావు ఆలయ నిర్వాహకులకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

**కందిలి, సిద్దిపేట**





## పేదల సొంతింటి కల నిజం చేయడమే...

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం!



- టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- కొల్కూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాల కార్యక్రమాలకు హాజరు

**కందిలి, సంగారెడ్డి**

పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యమని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట మండలంలోని కొల్కూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ముబారక్ పూర్ స్వరూప, ప్రభు కొత్తిళ్లలోకి వెళ్లారు. ఈ గృహ ప్రవేశ కార్యక్రమాల్లో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇల్లు కట్టుకుంటామని తాము కలలో కూడా ఊహించలేకపోయామని, తమ ఆనంద భాష్పాల ద్వారా నిర్మలా జగ్గారెడ్డికి స్వరూప అనే మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, సర్పంచులు మోహన్ గౌడ్, ఇందూరిబాబు, సర్పంచ్ సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ నేతలు మాణిక్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ధనరాజ్, వార్డు సభ్యులు సాబేర్, సందీప్, రమేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



# మే 10న మోదీ సభ...

- బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం!
- హాజరైన ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,
- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

**కందిలి, సంగారెడ్డి:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మే 10న హైదరాబాద్ రానున్నారు. ఇక్కడ నిర్వహించనున్న భారీ బహిరంగసభలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్. కె. లక్ష్మణ్, పార్టీ శాసనసభ, మండలి పక్ష నేతలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఏవీఎన్ రెడ్డి గారు, ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ప్రధాన కార్యదర్శులు ఎన్. గౌతమ్ రావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మేడేను జయప్రదం చేయండి!

- సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**కందిలి, సంగారెడ్డి**



ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం1886 మే నెలలో చికాగోలో కార్మికులు 8 గంటల పనిదినం కోసం పోరాటం నిర్వహించారన్నారు. కార్మికుల రక్త తర్పణతో ఏర్పడిన జెండా ఎర్రజెండా అని ఆయన వివరించారు. నేలకొరిగిన ఎందరో వీరుల ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. 1917 నవంబర్ 7 న రష్యాలో విప్లవం జయప్రదమై ఎర్ర జెండా అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చిన వెంటనే 8గంటల పనిదినం అమలు చేసిందన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి అందరికి దొరికిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పేదలపై భారాలు వేస్తూ పెద్దలకు వరాలు ఇస్తోందని విమర్శించారు. మే 1న జిల్లాలో జరిగే మేడే కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, సాయిలు, నర్సింలు, నాయకులు అశోక్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com